కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జగనన్నకు చెబుదాం, స్పందన

అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'జగనన్నకు చెబుదాం', స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం అత్యంత కీలకమని తెలిపారు. స్పందన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సకాలంలో పరిష్కరించడం ముఖ్యమని చెప్పారు. ప్రత్యేక దృష్టి సారించి స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీలకు నాణ్యతగా పరిష్కారం చూపించి రీఓపెన్ రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు స్పందన అర్జీల పరిష్కారంపై రోజూ మానిటర్ చేయాలన్నారు. జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు జిల్లాలో నిర్వహించే జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఈనెల 24 నుంచి 30 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడం, సచివాలయ పరిధిలో నిర్వహించే క్యాంపుల ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలని ఆర్‌డిఒలు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలను ఆదేశించారు. ఈ నెల 24 నుంచి 30 వరకు వార్డు, గ్రామ సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికీ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం ఉందో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుష్టు నిర్మూలన గోడపత్రికలు ఆవిష్కరణ

కుష్టు నిర్మూలనలో భాగంగా జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 26 నుంచి జులై 16 వరకు 21 రోజులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లెప్రసీ అనుమానిత వ్యాధిగ్రస్తులను సమర్థవంతంగా గుర్తించడానికి ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లు సర్వే చేయాలని చెప్పారు. ఇంత వరకు గుర్తించని/నమోదు కానీ కేసులను గుర్తించి సదరు వ్యాధి ఇతరులకు సోకకుండా సర్వే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్‌పి సిఇఒ, మున్సిపల్ కమిషనర్లు సచివాలయ, వాలంటీర్లకు ఆదేశాలు ఇవ్వడంతో పాటు ఆశా, వాలంటీర్లు జూన్ 26 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితులను గుర్తించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు కూడా వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లినప్పుడు లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... రీసర్వే రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇప్పటి వరకు 23 కేంద్రాల్లోనే రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. మిగతా 34 కేంద్రాల్లో కూడా రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలన్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా జిల్లా రిజిస్ట్రార్‌ను సంప్రదించి సమస్యను నివృత్తి చేసుకొని రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని తెలిపారు. డిఆర్‌ఒ నాగేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రమ, నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, డిఎంహెచ్ఒ రామగిడ్డయ్య, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, డిఎన్ఎంఒ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, హెచ్ఇఒ శివశంకర్, డిప్యూటీ హెచ్ఇఒ దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

చేనేతల సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం విఫలం

- చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ సి.గురు శేఖర్, చేనేత కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు చేనేత కార్మిక సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షులు కనికే లక్ష్మన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామర్తి రాజు, ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాధవస్వామి, గణేష్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ సి.గురుశేఖర్, వృత్తి సంఘాల సీనియర్ నాయకులు గోవిందు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు శేషఫణి మాట్లాడారు. దేశంలో నేతన్నల పరిస్థితి చాలా దారుణంగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మంది చేనేత కార్మికులు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాలో కోడుమూరు, ముడుములగుర్తి, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, గుడికల్, ఆదోని, కోసిగిలలో దాదాపు 30 వేల చేనేత కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. వీరు తయారు చేసిన వస్త్రాలు పేరుకుపోయి చేనేత రంగం సంక్షోభంలో పడిదని చెప్పారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేతలకు 11 రకాల రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రతి కుటుంబానికీ 3 సెంట్ల స్థలమిచ్చి షెడ్డు నిర్మించాలని కోరారు. నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ప్రతి చేనేత కార్మికునికీ షరతులు లేకుండా ఇవ్వాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కుటుంబానికీ రూ.5 వేల పింఛను ఇవ్వాలన్నారు. చేనేత కుటుంబానికి రూ.లక్ష రాయతీతో కూడుకున్న రుణం మంజూరు చేయాలని కోరారు. చేనేత కార్మికుడు అకస్మాత్తుగా మరణిస్తే వయస్సుతో నిమిత్తం లేకుండా బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పేరుకుపోయిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఇతర రాష్ట్రాల పవర్ లూమ్‌పై తయారవుతున్న వస్త్రాలను రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాలప్ప, సహాయ కారదర్శి కృష్ణ, జిల్లా నాయకులు రాజు, ఎల్లప్ప, శీను, లక్ష్మన్న, కృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ దగ్గర జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న అంజిబాబు

గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కెజిబివి పాఠశాలల్లో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కెజిబివి పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. వీరు గతేడాది గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేశారని, మెరిట్ లిస్టు ఆధారంగా, సెలక్షన్ ఆధారంగా, డెమో చేసి వీరిని సెలెక్ట్ చేశారని తెలిపారు. గత రెండేళ్లు పని చేసిన అనుభవం కూడా ఉందని, వీరు అనేక ఇబ్బందులకు గురవుతూ విద్యార్థులకు చదువులు చెప్పారని చెప్పారు. ఇప్పుడు వీరిని తొలగించడం సరైంది కాదన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు కూడా మే 30 వరకు ట్యూషన్ చెప్పి పాసయ్యే విధంగా పని చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరిని కాదని కొత్తవారిని తీసుకోవడం సరైంది కాదన్నారు. త్వరలో ప్రకటించబోయే మెరిట్ లిస్టును రద్దు చేసి పాత వారినే గెస్ట్ ఫ్యాకల్టీగా కొనసాగించాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపిస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు జయ నాగేశ్వరరావు, గెస్ట్ ఫ్యాకల్టీ నాయకులు కరుణ, శాంతి, శివలక్ష్మి, వేదవతి, వేదవతి, కృష్ణవేణి, చాంద్ బీబీ పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తు కోసమే విద్యకు పెద్దపీట

- 19వ వార్డులో జగనన్న విద్యా కానుక పంపిణీలో మేయర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో పేదల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోనే వారి పిల్లల చదువులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని నగర మేయర్ బివై.రామయ్య తెలిపారు. సోమవారం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డు 4వ తరగతి ఉద్యోగుల కాలనీలోని అంబేద్కర్ నగర్ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. మేయర్ రామయ్య హాజరై విద్యా కానుకతో పాటు ఆయన పుట్టినరోజు సందర్భంగా వచ్చిన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేక, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొన్న పేదలకు ఆరు పథకాల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నాంది పలికారని తెలిపారు. అలాగే చదువుకు దూరమైన పిల్లలను కూడా ప్రోత్సహించి వారికి చదువు దగ్గరయ్యేలా చేశారన్నారు. గత ప్రభుత్వం విద్యా రంగానికి రూ.3,115 కోట్లు మాత్రమే కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం రూ.60,329.42 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ స్థాయిలో ఖర్చు చేసిన ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో ఉంటే చెప్పాలని టిడిపి నేతలకు సవాల్ విసిరారు.

ప్రస్తుత, గత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలు గుర్తించాలి

గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను ఉపాధ్యాయులు గమనించాలని కోరారు. గత ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గత నాలుగేళ్లలో విద్యారంగంలో సమూల ప్రక్షాళన జరిగిందన్నారు. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకుని పేద విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు.

ఉపయోగపడే వస్తువులతో కలవాలి

ఆర్థిక స్థోమత ఉన్న ప్రజలు ఎవరినైనా ప్రముఖులను కలిసేటప్పుడు బోకేలు, దండలు, శాలువాలతో కాకుండా ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు వంటి స్టేషనరీలతో కలవాలని కోరారు. తద్వారా పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. తన పుట్టినరోజున వచ్చిన స్టేషనరీని ఇలా పేద విద్యార్థులకు ఉపయోగపడడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నిర్మల, నాయకులు కనికే శివరాం, సామన్న, వెంకటస్వామి, వెంకటరమణ, లక్ష్మిపతి, తిరుపాలు, శ్రీను, చిన్న, గోవర్ధన్, ప్రసాద్, సతీష్, సంతోష్, నీలమ్మ పాల్గొన్నారు.

19వ వార్డులో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న మేయర్ రామయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోందని తెలిపారు. శివారు కాలనీల్లో సుమారు వారానికోసారి తాగునీరు సరఫరా అవుతున్నాయని, బిందె నీటి కోసం ఎదురు చూసే పరిస్థితి ఉందని తెలిపారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కొత్తగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు అనేకమార్లు విన్నవించినా, ఆందోళనలు నిర్వహించినా స్పందన లేదని విమర్శించారు. పట్టణంలో ఉన్న పాత పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా అవుతోందని తెలిపారు. కొన్ని చోట్ల కలుషితమైన నీటిని తాగి రోగాల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని కోరారు. పట్టణంలో తాగునీటి సమస్య భవిష్యత్తులో రాకుండా శాశ్వత పరిష్కారానికి కొత్తగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ నాయకులు తిప్పన్న, ముక్కన్న, వెంకటేష్, నాగరాజు, మునెప్ప, ఖాన్, నాగేంద్ర ఉన్నారు.

తూకం వేస్తున్న సి.బెళగల్ చెరువు చేపలు

నిరుత్సాహ పరచిన చేపల దిగుబడి

- నష్టాలు తప్పదంటున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - సి.బెళగల్

జిల్లాలోని చెరువుల్లో అతిపెద్ద చెరువు సి.బెళగల్‌లో ఉంది. అయితే ఏటా రూ.40 లక్షలు వెచ్చించి చేప గుడ్డును వదిలితే దిగుబడి కోటి నుండి కోటి అరవై లక్షల వరకూ ఆదాయం చూసేవారు. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. చేపలు పట్టేందుకు కాలం ఆలస్యం అయినప్పటికీ సోమవారం మత్స్యకారులు సిద్ధమై పట్టివేశారు. మొదటి రోజు కేవలం 5 టన్నులు మాత్రమే పడ్డాయి. అతి తక్కువగా చేపలు పడడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. ఏటా మార్చి నెలలో పట్టేందుకు సన్నాహాలు చేసేవారు. ఈ సారి ముందు నుంచి చేప పిల్లలు ఎదగకపోవడం వలన మూడు నెలలు ఆలస్యంగా పట్టారు. ఏటా 600 టన్నుల నుండి వేయి టన్నులు దిగుబడి వచ్చేంది. మొదటి రోజే సుమారు 50 టన్నులు బెంగుళూరు, హైదరాబాద్, విజయవాడ, చెన్నై వంటి నగరాలకు ఎగుమతి చేసేవారు. కానీ ఈ ఏడాది కనీసం 300 టన్నులు పడతాయని ఆశించగా మత్స్యకారులు నిరాశే ఎదురయింది. అయితే రుచికి పెట్టింది పేరు బెళగల్ చెరువు చేపలకు భలే డిమాండ్ ఉంది.ఏటా ఒక్కొక్క చేప కేజీ నుండి ఐదు కేజీల వరకు బరువు ఉండగా ఈ సారి మాత్రం కేజీ బరువును మించినట్లు లేదు. దీంతో మత్స్యకారులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని మీడియా ఎదుట విన్నవించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్స్ ప్రారంభమైనట్లు కళాశాల. ప్రిన్సిపాల్ జె. హేమంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ఈనెల 24వ తేది వరకు కొనసాగుతాయని, ఇందుకుగాను కళాశాలలో ఉచిత రిజిస్ట్రేషన్ కేంద్రంఏర్పాటు చేసినట్లు తెలిపారు. 26వ తేది నుండి వెబ్ ఆప్షన్ నమోదు, 3న సీట్ అలాట్మెంట్ జరుగనుందని పేర్కొన్నారు.

మొదలైన డిగ్రీ ప్రవేశాలు

కోడుమూరు : ప్రస్తుత విద్యా సంవత్సరం 2023-24కు సంబంధించి డిగ్రీ కోర్సుల ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ మొదలైందని కోడుమూరులోని శ్రీ వివేకానంద కళాశాల ప్రిన్సిపల్ విజయకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, 26 నుంచి 30 వరకు కాలేజీల నమోదు, జూలై 3న కళాశాల కేటాయింపు, 4 నుండి తరగతులు ప్రారంభం అవుతాయని కళాశాల కరస్పాండెంటు మస్తాన్ భాష తెలిపారు.

రేమట గ్రామానికి రోడ్డు వెయ్యాలి

- ప్రజాసంఘాల నాయకులు - కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో
- ఎన్‌టిఆర్ సర్కిల్‌లో రహదారి దిగ్బంధం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం రేమట గ్రామానికి తారు రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ గ్రామ ప్రజలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో రోడ్డు దిగ్బంధం చేశారు. దాదాపు గంటకు పైగా ఎన్టీఆర్ సర్కిల్‌లో వాహనాలను నిలిపివేసి కొంతసేపు దిగ్బంధించారు. అనంతరం మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి అక్కడ చేరుకొని ప్రజాసంఘాల నాయకులను, గ్రామస్తులను ఆందోళన విరమించుకోవాలని కోరారు. తమ సమస్యను జిల్లా కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే వచ్చి పరిష్కరించేంతవరకు ఆందోళన విరమించేది లేదని బైఠాయించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు అధ్యక్షత వహించారు. ఈ ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రవి, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ పెద్ద వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి ఉసెనయ్య, రేమట కిష్టప్ప, ఊరు వాకిలి వెంకటేశ్వర్లు, మాదాసి కురువ నాయకులు సుంకన్నలు విచ్చేసి మద్దతు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రేమట గ్రామం కర్నూలు జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉందని, రోడ్డు పూర్తిగా దెబ్బతిని సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వాహనదారులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, గర్భిణులు సకాలంలో హాస్పటల్ చేరుకోక మధ్యలోనే పురుడు పోసుకున్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు. కొంతమంది గర్భిణులు మరణించిన సందర్భాలు ఉన్నాయని, గ్రామ ప్రజలు అనేకమంది ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరగకొట్టుకున్న పరిస్థితులలో ఆ రోడ్డు ఉందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో కాలేజీలకు చేరలేకపోతున్నారని, ఈ సమస్యను గ్రామ సచివాలయం అధికారుల నుండి మొదలుకుని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వరకు అందరికీ విన్నవించినా స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలతో కలిసి కలెక్టర్ కార్యాలయం దిబ్బంధం చేస్తామని, అనేక ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ 15 రోజుల్లో గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గుడి శేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అంజి, నగర అధ్యక్షులు అమర్, గ్రామ ప్రజలు గోకారి, భాస్కర్ రెడ్డి, బాబు రెడ్డి, చిన్న రాజు, వెంకటేశు, ఎం ప్రసాదు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రేమట గ్రామ ప్రజలు, మద్దతుగా పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ వేస్తున్న విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జె మోహన్, పట్టణ కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ వేసవికాలం మండిపోతూ విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే ఈ నెల విద్యుత్ బిల్లులు చూడగానే కరెంట్ షాక్ కొట్టినట్లు అయిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, ప్రజలకు షాక్ ఇస్తూ ఒకేసారి సర్దుబాటు చార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందని చెప్పారు. కరెంట్‌కు బిల్లులే కాకుండా ఫిక్స్, కస్టమర్, సర్, విద్యుత్ సుంకం సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయని అన్నారు. అసలు కరెంట్ చార్జీల కంటే కొసరు చార్జీలు అధికమయ్యాయని తెలిపారు. దొడ్డి దారిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలను వేస్తున్నాయని అన్నారు. సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీల వసూలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దానమన్న, రాజు, మునియప్ప, సిఐటియు నాయకులు అబ్రహం, చిన్న, హమాలీలు రవి, చిన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఇంటర్ పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారన్నారు. గత సంవత్సరం విద్యాశాఖ మంత్రి వచ్చే సంవత్సరం మొదటికల్లా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటిదాకా ఇవ్వలేదన్నారు. పుస్తకాలు ప్రింటింగ్ కూడా కాలేదని, ప్రభుత్వం ఏమో విద్యార్థులు బయట నుండి కొనుక్కోవాలని అంటున్నారన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిటీ అధ్యక్షులు అమర్, అంజి, యోగి తదితరులు పాల్గొన్నారు.

వినతి అందజేస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సిపిఎం కార్యకర్తలు నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, కార్పొరేట్ మతతత్వ అవినీతి రాజకీయాలను అడుగడుగునా ఓడించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ తెలిపారు. ఓర్వకల్లు, కల్లూరు మండలాల పార్టీ సభ్యుల శిక్షణా తరగతులు కామ్రేడ్ సూర్యనారాయణ భవనంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 'మతతత్వం-వివిధ తరగతులపై దాని ప్రభావం' అంశంపై డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్ బోధించారు. ప్రిన్సిపల్‌గా ఓర్వకల్ మండల కార్యదర్శి బి నాగన్న వ్యవహరించారు. కల్లూరు మండల కార్యదర్శి కే మధు, శాఖ కార్యదర్శి, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి రామకృష్ణ

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

- మున్సిపాలిటీలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు - మున్సిపల్ ఛైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఛైర్మన్ శాంత

పట్టణంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సదుపాయం కల్పిస్తూ సమగ్రాభివృద్ధికి పాటు పడుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయమనోజ్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో మున్సిపల్ ఛైర్మన్ శాంత ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2019 నుంచి గత జనవరి వరకు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ రూ.20 కోట్లతో సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం ఇతర పనులు చేపట్టామని వివరించారు. పట్టణంలోని క్రాంతి నగర్ ప్రాంతంలో 20 ఏళ్లుగా, రేణుకాంబ హోటల్ వెనకవైపు 30 ఏళ్లుగా, విజయనగర కాలనీలో 15 ఏళ్లుగా జరగని అభివృద్ధిని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్పందించి అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విమర్శలు చేస్తున్న వారు వీటిని గమనించాలని కోరారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కొంతమందికి అవగాహన లేకుండా ఎక్కడా అభివృద్ధి జరగడం లేదని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, ఆయా వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులపై ప్రజలే ప్రచారం చేయాలని కోరారు. ముఖ్యంగా మురుగునీటి కాలువలను ఆక్రమించి ఎవరూ నిర్మాణాలు చేపట్టవద్దని, వాటిని తొలగించుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, కౌన్సిలర్లు బాలాజీ, రఘునాథ్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారమందించాలి

- జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

గతేడాది కల్తీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారమందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశులు, అయ్యప్ప డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో నాయకులు శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నకిలీ కంపెనీలను బ్లాక్ లిస్టులో ఉంచాలని, బీమా పరిహారం చెల్లించాలని కోరారు. పత్తి, ఉల్లి, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో తాగు, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించాలని, పంటలను జింకల బారి నుంచి రక్షించడానికి పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించరాదన్నారు. రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలివ్వాలని, మండలంలో తనిఖీలు నిర్వహించి కల్తీ విత్తనాలు అమ్మే డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల కమిటీ సభ్యులు హనుమంతు రెడ్డి, తిక్కన, బాష, రామాంజనేయులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజలకు లబ్ధిపత్రాలను అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం 30వ వార్డులో మూడోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరా, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని తెలిపారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లోనూ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రణాళిక మేరకు సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎఐఐబి స్కీం కింద మంజూరైన రూ.142 కోట్లతో పైపులైన్లు, ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అవి పూర్తయితే ఇంటింటికి కుళాయిలు మంజూరు కానున్నట్లు తెలిపారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - నందవరం

తీరు మార్చుకోవాలని మండల స్థాయి అధికారులు పదే పదే చెప్పినా సచివాలయ ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు. మండలస్థాయి అధికారులు సోమవారం ఉదయం 10 గంటలకు వచ్చి స్పందనకు హాజరవుతున్నారు. సచివాలయంలో ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు. సోమవారం నందవరం సచివాలయం-3లో 11.30 గంటలకు కూడా ఉద్యోగులు హాజరు కాలేదు. ఎందుకు హాజరు కాలేదని వచ్చిన ఒక ఉద్యోగిని అడిగితే కొంతమంది వచ్చారు, వారు డ్యూటీపై బయటకు వెళ్లారని సమాధానమిచ్చారు. కార్యాలయానికి వచ్చిన ఉద్యోగి కచ్చితంగా మినిట్ బుక్‌లో తాము రోజు వారీగా ఏం చేశామో రికార్డు చేయాలి. ఏ ఉద్యోగి తన మినిట్ బుక్‌లో సరైన సమాధానం రాయకుండా మండల స్థాయిలో కార్యాలయానికి వెళ్లామని రికార్డు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు మండల స్థాయి అధికారులంటే భయం లేకుండా పోయిందని, మండలంలో ఇంత వరకు ఏ ఒక్క ఉద్యోగిపై చర్యలు తీసుకోకపోవడంతోనే వారికి ఉన్నతస్థాయి అధికారులంటే భయం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

11.30 గంటలకు కూడా విధులకు హాజరు కానీ ఉద్యోగులు

మండలస్థాయి అధికారులు స్పందించి సకాలంలో హాజరు కానీ వారికి మెమోలు జారీ చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. **హాలహర్వి** మండలం విరుపాపురం గ్రామంలో సచివాలయ సిబ్బంది ఉదయం 11 గంటలు దాటినా సచివాలయానికి రాలేదు. సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా సచివాలయానికి వస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సమయపాలన పాటించకపోవడంతో తమ పనులు ముందుకు సాగడం లేదని, ఉన్నతాధికారులు నిఘా ఉంచి ఆలస్యంగా వస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సెక్రటరీ నిరంజన్‌ను వివరణ కోరగా... తమ సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. అందులో ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉన్నారని, ఒకరు కర్నూలుకు బదిలీపై వెళ్లారని, మిగతా వారు పని నిమిత్తం బయటకు వెళ్లారని వివరించారు.

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

టీం జగనన్న కృషి ప్రశంసనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

ముఖ్యమంత్రి జగన్‌కు తోడుగా 'టీం జగనన్న' చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన ఐదుగురు సభ్యులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా 'టీం జగనన్న' యాప్‌లో చురుకుగా ఉంటూ ప్రభుత్వం తరపున, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల వివరిస్తూ, వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి, పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మెరుగ్గా పని చేస్తున్న ఎం.అవతారం, హెచ్.సోమన్న, బి.హనుమంతు, ఈరన్న, మహబూబ్‌ను గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర ఉన్నతాభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' అందజేత

ప్రజాశక్తి-పెద్దకడబూరు

మండలంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా నగదు, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో, కస్తూరిబా గాంధీ, గురుకుల విద్యాలయంలో ఎంఇఒ సువర్ణ సునీయం ఆధ్వర్యంలో అందజేశారు. ముఖ్య అతిథిగా జడ్‌పిటిసి రాజేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, సర్పంచి రామాంజనేయులు హాజరయ్యారు. ఎంపిటిసీలు ముత్తమ్మ, బడెమ్మ, సొసైటీ అధ్యక్షులు మణేగారి రవీంద్ర, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బొడ్డన్న, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రంగన్న, లక్ష్మన్న, సిఆర్‌పి లక్ష్మన్న, వైసిపి నాయకులు ఎల్లప్ప, తెలుగు వీరేష్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ జిల్లాస్థాయిలో పోటీ పడాలి

- సర్పంచి సావిత్రి, ఎంఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థీ జిల్లా స్థాయిలో పోటీ పడాలని నందవరం, ముగతి సర్పంచులు తోట సావిత్రి, విరుపాక్షి రెడ్డి, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివరాములు ఆకాంక్షించారు. సోమవారం నందవరం జడ్‌పిహెచ్, ముగతి మోడల్ స్కూల్‌లో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. నందవరంలో 1, 2, 3వ స్థానాల్లో నిలిచిన మణికంఠ, మానస, భారతి, ముగతిలో 1, 2, 3వ స్థానాల్లో నిలిచిన ఎం.భరణి గోవిందు, షేక్ మహబూబ్, గంగవరం పవిత్రకు రూ.3 వేలు, రూ.2వేలు, రూ.1000లతో పాటు మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. ప్రతి విద్యార్థీ చదువులో ఇష్టంలో పోటీ పడుతూ బాగా చదవాలన్నారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఇంగ్లీష్ ప్రసాద్, భోజరాజు, మేరీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సర్పంచి సావిత్రి, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి

హంద్రీనీవా స్థిరీకరణ పనులను పూర్తి చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - దేవనకొండ

హంద్రీనీవా స్థిరీకరణ పనుల వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పంట కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి కోరారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి నరసరావు అధ్యక్షత వహించారు. నాయకులు వెంకటేశ్వర్లు, మధు, సుల్తాన్, మహదేవ, రామాంజి, శ్రీనివాసులు, రాజన్న, శంకర్, కోదండ, మనోజ్, మధు, జయన్న, గోవిందు, రంగస్వామి, కోమేష్, వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు. **ఆస్పరిలో** సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ... వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిలకు పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, ఉరుకుంద, చంద్రశేఖర్, హమాలీ సంఘం నాయకులు హనుమంతు, నాగరాజు, మల్లి, రంగప్ప, రంగన్న, నాగేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ చెన్నకేశవులు మృతి

- అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సుదీర్ఘకాలంగా డేటా ఎంట్రీ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వై.చెన్నకేశవులు మృతి చెందారు. గత రెండు వారాల క్రితం అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోలుకోలేక ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం గోనెగండ్లలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి జయమ్మ, భార్య, కుమార్తె ఉన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లలిత శబ్ద, చిత్రాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని భీమాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన లలిత శబ్ద, చిత్రాలయాన్ని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... శబ్ద, చిత్రాలయం ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆడియో, వీడియో తరగతులను బోధించేందుకు అనువుగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల సెక్రటరీ పి.విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ జిఎస్.సురేంద్ర బాబు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించలేని స్థితిలో పంచాయతీలు

- ఇతర గ్రామాల రోజువారీ కూలీలతో పారిశుధ్య పనులు
- మేజర్ పంచాయతీ సర్పంచి హైమావతి

పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - గోనెగండ్ల

కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో విధులు హాజరు కావడం లేదు. డ్రెయినేజీ కాలువలు నిండి దుర్వాసన రావడం, మురుగు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వస్తాయని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన సర్పంచి హైమావతి, పంచాయతీ సెక్రటరీ రంగనాయకులు పారిశుధ్య పనులు చేయడానికి పక్క గ్రామాల నుంచి కూలి పనులు చేసే వారిని రోజువారీ కూలీగా మాట్లాడి పనులను ప్రారంభించారు. సర్పంచి హైమావతి కూలీల దగ్గరుండి పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంచాయతీలో పని చేసే కార్మికులు, పారిశుధ్య కార్మికులకు కొన్ని నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సమస్యలు వస్తే తీర్చలేని పరిస్థితుల్లో పంచాయతీలు ఉన్నాయని చెప్పారు. పంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. వార్డు మెంబర్ వంకల సుభాన్, మదీన, బాబు నాయుడు, మెకానిక్ మలాంగ్ పాల్గొన్నారు.

వైసిపి అరాచకాన్ని అరికట్టండి

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో వైసిపి అరాచకాన్ని అరికట్టాలని టిడిపి నాయకులు కొండయ్య చౌదరి, కలీముల్లా, దయాసాగర్, రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తన తండ్రి చిన్నతనంలోనే మరణించినా ఆ కుటుంబానికి అన్ని తానై వ్యవహరిస్తున్న అమర్‌నాథ్ గౌడ్ కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవాలని చేసిన ప్రయత్నం అతడి ప్రాణాలు తీసిందని పేర్కొన్నారు.

నకిలీల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వీరశేఖర్, అశోక్, యూసుఫ్ బాష మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపథ్యంలో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని మండలంలో నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోందని తెలిపారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు సాగు చేసిన చాలామంది రైతులు నష్టపోయారని చెప్పారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ముందస్తుగా బోర్లు, బావులు, చెరువుల కింద, హంద్రీ నీవా కాలువల ద్వారా సాగు చేసుకుంటున్న రైతులు పత్తి విత్తనాలు నాటారని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల కొన్ని మొలవక, మరికొన్ని మొలకెత్తిన మొక్కలు మొత్తం ఎర్రబారి ఉపయోగం లేకుండా పోతున్నాయని చెప్పారు. ఈ పత్తి విత్తనాలు అమ్మిన వ్యాపారులపైనా, కంపెనీపైనా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కొంత నష్టం జరిగినా, సాగునీటి సదుపాయం ఉన్నచోట కూడా భారీగా పత్తి విత్తనాల వల్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. వ్యాపారులు ఆడిందే ఆటగా వారి ఆటలు సాగుతున్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలతో అధిక మొత్తం లాభాల కోసం రైతులను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయో ఎరువుల పేరుతో భారీగా దందా జరుగుతోందని, అనుమతుల్లేకుండా, రైతులను మభ్యపెట్టి జోరుగా బయోమందుల వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలిగించే బయో మందుల వ్యాపారంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బికెల ద్వారా విత్తనాలు, మందులు సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి భూములకు తగ్గట్లు పంటలు వేసుకునేలా రైతులను చైతన్యం చేయాలని తెలిపారు. రైతులు రామాంజనేయులు, రంగడు, మల్లికార్జున పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆదోని ఆర్‌టిఒ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. కొన్ని పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలి : సిపిఎం

ఎమ్మిగనూరు : పెంచిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు బి. రాముడు, లక్ష్మి నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో కరపత్రం విడుదల చేశారు. ఆంతోని, గోపాల్ రెడ్డి, రాజు, ఎర్రన్న పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రేమకాంతప్ప మృతి

ఆదోని : ఆదోనిలోని ఎస్ఐ ప్రేమకాంతప్ప ఆకస్మిక మృతితో పోలీసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రేమకాంతప్ప పదోన్నతిపై ఆదోనిలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత రాత్రి వాంతులు, విరోచనాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందారని సోమవారం బంధువులు తెలిపారు. విధుల్లో ఎంతో నిష్పక్షపాతంగా, నిజాయితీగా ఉండేవారని పోలీసులు తెలిపారు. ఆయన మృతి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడు ప్రేమ కాంతప్పకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

'గురుకుల'లో సీట్ల సంఖ్య పెంచాలి

ఆదోని : కెజిబివి, ఎపి మోడల్, గురుకుల పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షులు మోపిరి సూర్య ఎరుకులి కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడారు. కెజిబివి, ఎపి మోడల్ స్కూల్స్, ఎపి గురుకుల పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి వరకు ఇంకా 20 సీట్లు పెంచాలని కోరారు. బాలికల అక్షరాస్యతను పెంపొందించేందుకు సీట్లు పెంచాల్సిన అవశ్యకత ఉందన్నారు.

మోసాలకు పాల్పడుతున్న విత్తన వ్యాపారులు

- పట్టించుకోని అధికారులు
- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విత్తన వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నా అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని టిడిపి ఆదోని మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప విమర్శించారు. సోమవారం పట్టణంలోని సిటీ ప్రెస్ కాంపౌండ్‌లో ఉన్న వారి కార్యాలయంలో ఎల్‌ఎల్‌సి మాజీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, ఆత్మ మాజీ ఛైర్మన్ ఫక్రుద్దీన్‌తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో నాణ్యత లేని పత్తి విత్తనాలు సాగు చేసి వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట ఏపుగా పెరిగినా పూత, కాయలు లేక పంట ఎకరాకు కేవలం రెండు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. కొనుగోలు సమయంలో బిల్లు, రషీదు, ప్యాకెట్ ఇతర రుజువులు చూపినప్పటికీ డీలర్లు సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని తెలిపారు. బసాపురం, చిన్నహరివాణం, పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, హానవాలు రైతులకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించినా పరిహారం మంజూరు కాలేదన్నారు. రూ.850 ఎంఆర్‌పి ధర ఉన్న పత్తి విత్తన ప్యాకెట్లను వ్యాపారులు రూ.1200 నుంచి 1500 వరకు కంపెనీ డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారని తెలిపారు. జాదు, సైరా, అకిరా కంపెనీల పేరుతో రైతులను దగా చేస్తున్నారన్నారు. రైతులు మోసానికి గురవుతున్నా పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. పత్తి, మిరప విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ధరలను అమాంతంగా పెంచి వ్యాపారులు లాభపడుతున్నారని తెలిపారు. విత్తన స్టాక్ వివరాలను డీలర్లు బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అగ్రికల్చర్ ఉద్యోగులను విత్తన దుకాణాల వద్ద నిఘా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పట్టాదారు పాసు పుస్తకానికి విస్తీర్ణాన్ని బట్టి కావాల్సిన విత్తనాలను ఎంఆర్‌పి ధరకు అందేలా చూడాలన్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు వి.ఎం.గోపాల్, మల్లేశప్ప, సోమశేఖర్ రెడ్డి, రాముడు, కారుమంచప్ప, షేక్షావలీ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తప్పుదోవ పట్టించడం మంచిది కాదు

- యుటిఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు

ప్రజాశక్తి - ఆదోని

పురపాలక శాఖ ఆర్‌జెడి ఉత్తర్వుల మేరకు రేషనలైజేషన్ ఉత్తర్వులు పొంది ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలకు వెళ్లిన 23 మంది ఉపాధ్యాయులపై కొందరు అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడడం సరికాదని యుటిఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద యుటిఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 23 మంది ఉపాధ్యాయులు 2017లో రేషనలైజేషన్ ద్వారా పదోన్నతులు పొందారన్నారు. మున్సిపల్ పాఠశాల పనిచేస్తున్న సునీల్ రాజ్ కుమార్ కిలిచిన పేట పురపాలక పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారని తెలిపారు. మరో ఉపాధ్యాయులు రమేష్ నాయుడు కూడా ఆర్‌ఆర్ కాలనీలో కొనసాగుతున్నారని చెప్పారు. అదే పాఠశాలలో 9 మంది రేషనలైజేషన్ ద్వారా కొనసాగుతున్నారన్నారని తెలిపారు. మున్సిపాలిటీ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసే క్రమంలో కొన్ని తప్పులు జరగడం ద్వారా డిప్యూటేషన్ పొందిన వారి పాఠశాలలో ఎంఇఒ లాగిన్‌లో మ్యాపింగ్ చేయకపోవడం వల్ల సమస్య తలెత్తిందన్నారు. కొందరు అవగాహన రాహిత్యంతో అధికారులను, మీడియాను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి వాటిపై కాక విద్యార్థుల భవిష్యత్తుపై శ్రద్ధ పెడితే మంచిదన్నారు. మల్లికార్జున, మహేష్, సునీల్ రాజ్ కుమార్, రిషికేష్, జహంగీర్, అమీన్ పాల్గొన్నారు.

హై స్కూల్ ముందు నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ వేతనాలివ్వాలి

- ఎంపిడిఒకు వ్యకాస వినతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రీన్ అంబాసిడర్ల వేతనాలను వెంటనే ఇవ్వాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేవలం రూ.6 వేల వేతనంతో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నెలల తరబడి పెండింగ్‌లో వేతనాలు ఉండడం వల్ల స్వచ్ఛభారత్ కార్మికులు పస్తులతో ఉంటున్నారని పేర్కొన్నారు. వెంటనే స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలు చెల్లించకపోతే కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. వ్యకాస నాయకులు యూసుఫ్ బాష పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడారు. ప్రాణ హాని ఉందని తెలిసినా ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 3,600 కిలోమీటర్ల భారత్ జోడో పాదయాత్ర విజయవంతంగా నిర్వహించారన్నారు. 2024లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఖలందర్, సీనియర్ నాయకులు శ్రీధర్, మండల అధ్యక్షులు నెట్టేకల్ హనుమంతు, ఉపాధ్యక్షులు కుప్పగల్ అయ్యన్న పాల్గొన్నారు.

పట్టపగలే బంగారు, నగదు చోరీ

-గుమస్తాను బురిడీ కొట్టించి రూ.4 లక్షల నగదు, 800 గ్రాముల బంగారు చోరీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో పట్టపగలే బంగారు షాపులో దొంగతనం జరిగింది. సోమవారం ఉదయం బంగారు షాపులో గుమస్తాను బురిడీ కొట్టించి దాదాపు 800 గ్రాముల నుంచి కిలో వరకు బంగారు నగలు, రూ.4 లక్షలు నగదుతో సెల్ ఫోన్‌ను ఓ గుర్తు తెలియని దొంగ ఎత్తుకెళ్లాడు. పట్టణంలోని ఆదోని రోడ్డులో ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసం ఉండే రఘువీరాకు పట్టణంలోని పెద్ద మసీద్ రోడ్డులో రామస్వామి గుడి వద్ద బంగారు దుకాణం ఉంది. రోజూలాగే సోమవారం ఉదయం కూడా రఘువీరా షాపునకు వచ్చారు. బంగారు నగలు, నగదు, ఓనర్ సెల్ ఫోన్‌ను బ్యాగ్‌లో ఉంచి షాపులో పెట్టి గుమాస్తకు చెప్పి పక్కనే ఉండే దేవాలయానికి వెళ్లారు. ఇంతలోనే ఓ ఆగంతకుడు షాపు గుమస్తాను మభ్యపెట్టి బ్యాగ్‌ను ఎత్తుకెళ్లాడు. దొంగతనం చేసిన దృశ్యం సిసి కెమెరాలో రికార్డు అయింది. ముందుగా ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై వేచి ఉన్నారు. వారి స్కూటర్‌పై ఎక్కి పరారయ్యారు. రఘువీరా షాపులో చోరీ జరగడం ఇది 2వ సారి. దొంగను పట్టుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు రఘువీరా పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

బంటనహాల్ రైల్వే స్టేషన్ నుంచి ఏరూరు గ్రామం వరకు జరుగుతున్న గ్రావెల్ రోడ్డు పనులను ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంటనహాల్ స్టేషన్‌కు రావడానికి ప్రజలు, ప్రయాణికులు, పొలాలున్న రైతులు ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో రోడ్డు పనులను చేపట్టామన్నారు. గ్రావెల్ రోడ్డు వేయడంతో పలు గ్రామాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైసిపి కన్వీనర్ రంగస్వామి, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, వైసిపి నాయకులు శ్రీధర్, షేకన్న, బాలకృష్ణ, సతీష్, రంగముని, పరమేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న గుమ్మనూరు నారాయణ

నందవరం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

నందవరం : నందవరం ఎస్ఐగా పి.తిమ్మయ్య బాధ్యతలు చేపట్టారు. సోమవారం స్టేషన్‌లో బదిలీ అయిన ఎస్ఐ మహేష్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ తిమ్మయ్య మాట్లాడుతూ... సాధారణ బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ రూరల్ నుంచి వచ్చినట్లు తెలిపారు. ప్రజలు సమస్యలను నేరుగా తెలియజేసి న్యాయం పొందాలని కోరారు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.67/2022

శ్రీమతి ఎ.పద్మావతి. ...వాది

-వర్సెస్-

ఎ.బాలప్ప వగైరా. ...ప్రతివాది

3వ ప్రతివాదికి దావా సమన్సు

ఎ.రాజకుమార్ తండ్రి ఎ.బాలప్ప,
ఇంటి నెం.18/44-జె,ఎ.కె.మార్కెట్,
నెహ్రూరోడ్డు, కర్నూలు.

పై నంబరు దావాలో వాది, షెడ్యూలు దాఖలా ఆస్థిలో 1/5వ భాగం పంచి ఇవ్వమని (2) సదరు షెడ్యూలు ఆస్థిని పంచి ఇచ్చిన తరువాత కోర్టువారు కోర్టు కమీషనరు ద్వారా ఒక్కొక్కరికి 1/5 వ భాగం విభజించి ఎవరి భాగము వారికి స్వాధీనం చేయమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 20-06-2023వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు :-

The Residential property bearing Door No. 18/44/J and 18/44/J/1(Consisting Ground floor and First floor) situated at Nehru road, Kurnool which is within the limits of Municipal Corporation, Kurnool and also within Jurisdiction of The Registration District of Kurnool and Sub-Regn. Office of Kurnool.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 20-06-2023

యం.ఆర్.క్రిష్ణ,
పి.పాపన్న
శ్రీమతి.రాధారాణి,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కార్య నిర్వాహక కార్యదర్శి పి.సునీల్ కుమార్

ఒలింపిక్ క్రీడా ఉత్సవాలకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో జరిగిన ఒలంపిక్ సంబరాలో అంతర్ పాఠశాలల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. స్టేడియంలో జరిగిన మూడు క్రీడాంశాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం.

కబడ్డీ : అవుట్డోర్ స్టేడియంలో జరిగిన కబడ్డీ క్రీడాకారులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు కబడ్డీ సంఘం కార్యదర్శి, శిక్షకులు భూపతి పాల్గొని పరిచయం చేసుకుని లాంఛనంగా ప్రారంభించారు. అలాగే సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహణ కార్యదర్శి పి.సునీల్ కుమార్, జిమ్నాస్టిక్స్ పోటీలను సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ కార్యదర్శి విజయ్ కుమార్ ట్రెజరర్ శ్రీనివాస్ గౌడ్, సంఘ ప్రతినిధి రసూల్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నిరంకుశ పాలనకు చరమగీతం

- నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

బిజెపి నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని దామోదర సంజీవయ్య భవన్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కటింగ్ చేశారు. అనంతరం కంపాషన్ సొసైటీ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ హబీబ్ ఖాన్, జిల్లా యస్సి సెల్ అధ్యక్షులు నాగళింగం, జిల్లా నాయకులు సాంబశివుడు, రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ బోయ నాగరాజు, నాయకులు వెంకట నాయుడు, లోకనాత్, నాగరాజు, మల్లికార్జున, మధు, వెంకటేశ్వర్లు, సుంకన్న, శేఖర్, జయకృష్ణ, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జె లక్ష్మీ నరసింహ యాదవ్

కబడ్డీ జిల్లా విజేతగా శ్రీ ఉమా మాధవ పాఠశాల జట్టు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ఒలంపిక్ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీలలో శ్రీ ఉమా మాధవ పాఠశాల బాలికల జట్టు జిల్లా స్థాయి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ కృష్ణ జట్టు విద్యార్థినులను, అందుకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు తేజను అభినందించారు.

చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా పోలీసు స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారించి న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల నుంచి వినతులను ఎస్పి స్వీకరించారు. ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 109 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

- కరెంట్ ఆఫీసులో సబ్ స్టేషన్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకోని మోసం చేశాడని నందవరం మండలం, హాలహర్వి గ్రామానికి చెందిన హనుమంతు ఫిర్యాదు చేశారు.
- నా మొబైల్ క్యాంటిన్ వాహనంను ఒక వ్యక్తి బాడుగకు తీసుకుని అక్టోబర్‌లో క్యాంటిన్ వాహనంతో వెళ్ళిపోయి ఇంతవరకు తిరిగి రాలేదని కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన షాహుబుద్దీన్ ఫిర్యాదు చేశారు.
- చిన్న కుమారుడు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు బుధవార పేటకు చెందిన ప్రభుదాస్ ఫిర్యాదు చేశారు.
- గోదాములు ఉన్నాయని, పొగాకు వ్యాపారం చేస్తున్నాని చెప్పి నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోని మోసం చేశాడని కర్నూలు సి.క్యాంపు, వెంకటరమణ కాలనీలకు చెందిన బాధితులు అనసూయ, లలిత, పలువురు ఫిర్యాదు చేశారు.
- రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి సింటెక్స్ వాటర్ క్యాన్స్ తయారీకి మెటీరియల్, పౌడర్ పంపిస్తామని చెప్పి డబ్బులు తీసుకోని మోసం చేశాడని కర్నూలు, కల్లూరుకు చెందిన కను చరణ్ ఫిర్యాదు చేశాడు.
- సోమాయాజుల పల్లెలో ఉన్న నా పొలాన్ని ఒక వ్యక్తి దౌర్జన్యంగా వేసుకుంటున్నాడని బేతంచేర్ల మండలం శంకరాపురం గ్రామానికి చెందిన చిన్న తిరుపాలు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్ద పీట : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.శ్రీదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం పత్తికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదుతో పాటు ప్రశంస పత్రాలు, మెమోంటో అందజేశారు. వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, సర్పంచి కొమ్ము దీపిక, జెడ్పీటీసీ, ఉరుకుందమ్మ, ఎంపీటీసీ నీలకంఠ, ఎంఈఓ మస్తాన్వలి, హెచ్ఎం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

కర్నూలు హాస్పిటల్ : వైకాపా ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందని 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి అన్నారు. శరీన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు మంగలి లిఖిత, వై పద్మకీర్తి రెడ్డి, దాదేపోగు రీటాకు ప్రశాంస పత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు హుస్సేన్ ఆలం, పీడీ బాషా, షైక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రశంస పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి

స్పందనకు మండల అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి చాలా మంది మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. తహసీల్దార్, ఎంపీడీఓ, అగ్రికల్చర్, ఏపీఎం, ఐసిడిఎస్, ఆర్డబ్ల్యుఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు. వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వస్తే ఆ శాఖల అధికారులు లేకపోవడంతో వెనుతిరిగి పోవాలిసిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని స్పందన కార్యక్రమంకు మండల స్థాయి అధికారు లందరూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మద్దికెర : మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను చేర్చుకుంటున్నారని, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు ఎంఇఒ రంగస్వామికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించుకోవడంతో అంగన్వాడి సెంటర్లో పిల్లల శాతం తగ్గుతుందని అన్నారు. ఎంఇఒ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామాంజనమ్మ, విశాలమ్మ, రంగమ్మ, చంద్రకళ, రాజేశ్వరి, రామలింగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కడవల రవికుమార్, మండల అధ్యక్షులు వంశీ పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి- వెల్దుర్తి : వెల్దుర్తి, బోయనపల్లె గ్రామాల్లో నాటుసారా నిర్వాహకులపై సెబ్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఇద్దరు వ్యక్తులు దూల రామచంద్రుడు, లద్దగిరి రామాంజనేయులును అరెస్టు చేశారు. 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వెల్దుర్తి, కోడుమూరు సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - సి బెళగల్ : ప్రతి రైతు పంటలు సాగు చేయాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ మల్లేష్ కుమార్ అన్నారు. సోమవారం పంట పొలాల్లో సిబ్బంది ప్రవీణ్, వెంకటేశ్వర్లు, బిందులు భూసార పరీక్షలు నిర్వహించగా ఆయన పర్యవేక్షణ చేపట్టారు. ఇక్కడే మండలానికి 352 నమూనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, మండలంలోని 16 ఆర్బీకేలకు 22 చొప్పున సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 25 ఎకరాలకు ఒక నమూనా పరీక్షల శాంపుల్స్ సేకరించాలని అన్నారు.

విద్యార్థినికి అభినందనలు తెలుపుతున్న వైస్ ఛాన్సలర్

జాతీయ పోటీలకు ఆర్‌యు విద్యార్థిని

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్ : రాయలసీమ యూనివర్శిటీ కర్నూలుకు చెందిన విద్యార్థిని ఆకాంక్ష మట్టే ఇండియన్ యూనివర్శిటీ బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు ఎంపికైంది. జులై 28 నుండి ఆగస్టు 8 వరకు చైనాలోని చెంగ్డూలో జరిగే వరల్డ్ యూనివర్శిటీ గేమ్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సోమవారం ఫిజిక్స్ ఎడ్యుకేషన్ విభాగం వారు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ఎ ఆనందరావు ఆమెను సత్కరించారు. విసి మాట్లాడుతూ యూనివర్శిటీ చరిత్రలో ఇండి యన్ యూనివర్శిటీకి ప్రాతినిధ్యం వహించడం ఇదే ప్రథమమని అన్నారు. క్రీడాకారుల కృషి వెలకట్ట లేనిదన్నారు. యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సివి కృష్ణా రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరా నంద పుచ్చ, డాక్టర్ కెవి శివ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యారంగ అభివృద్ధికి పాటుపడండి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఉన్నత విద్యారంగ అభివృద్ధికి అధ్యాపకులు పాటుపడాలని ఆర్‌యు వైస్ ఛాన్సలర్ ఏ.ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో నూతన విద్యా విధానం అమలులో భాగంగా అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సర్ ఆనందరావుతో పాటు ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రెహమాన్, జాతీయ ఉర్దూ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ వనజ మహదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంపై అధ్యాపకులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ సివి కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానందపుచ్చా, ప్రిన్సిపల్ ఎన్‌టికె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టిజి వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఐక్యమత్యంగా ఉంచేందుకు వీలుగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభను ఏర్పాటు చేశామని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు. సోమవారం నగరంలోని హొటల్ మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీజీ వెంకటేష్, యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అనంతరం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ నార్త్ విభాగం అధ్యక్షులుగా కోన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా నరసింహారావుతో కూడిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరినీ టీజీ వెంకటేష్, టీజీ భరత్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షులు టంగుటూరు రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాజ శేఖర్, జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, కోఆర్డినేటర్ ఇల్లూరు లక్ష్మయ్య, వాసవి సత్రాల సముదాయం అధ్యక్షులు దేవకి వెంక టేశ్వర్లు, ఎస్.కే.మహేష్ మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఇ.పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎలాంటి చట్టాలు వర్తించని కాంట్రాక్టు కార్మికులు మురుగు కాలువల్లో, కల్వర్టుల్లో దిగి ప్రమాదకరమైన పనులు చేస్తున్నారని, వారి భద్రతకు నగర పాలక అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఇ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భాస్కర్ నగర్‌లో దాదాపు నాలుగు అడుగుల లోతులో కార్మికులను 30 సెకండ్ల పాటు కనిపించకుండా కల్వర్టులోకి ప్రవేశించి మురుగును పైన వేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్లకు బూట్లు, చేతులకు బ్లౌజులు, మొకానికి మాస్కులు లాంటివి ఏవీ లేవని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదవశాత్తు కార్మికుడు అనారోగ్యానికి గురైతే ఎలా అని, జరగరానిది ఏదైనా జరిగితే నిరుపేద కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు. నగరంలో పేరుకుపోయిన మురికి కాలువల్లో, కల్వర్టుల్లో మట్టిని తొలగించడం అభినందనీయమే కానీ మినీ వాహనాలతో తొలగించాలన్నారు. విషవాయువు దాగి ఉండే భారీ కల్వర్టు(మోరీ)లో కార్మికులను దించి పేరుకుపోయిన మురుగును తొలగించడం తగదన్నారు. కమిషనర్, ప్రజారోగ్యాధికారి స్పందించి పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు కిట్లు బ్లౌజులు, మాస్కులు సరఫరా చేసి వారి భద్రతపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తుగ్గలి

గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే గడపగడప మన ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. సోమవారం మండలం పరిధిలోని రాంపల్లిలో స్థానిక నాయకులు నాగభూషణం రెడ్డి, వెంకటరాముడు, కోటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ మనీంద్ర, లాలన్న ఆధ్వర్యంలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ మనీంద్ర, నాగభూషణం రెడ్డి, వెంకట రాముడు, కోటీశ్వర్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, లాలన్న, జుటూర్ రాజు, చక్రవర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే

కరెంటు తీగలను తొలగించాలని సిపిఎం వినతి

తుగ్గలి మండలం రాంపల్లి గ్రామంలో ఇండ్ల పైన ఉన్న కరెంటు తీగలు తొలగించాలని సిపిఎం మండల నాయకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గమాట్లాడుతూ రాంపల్లి గ్రామంలో గత 20 సంవత్సరాల నుండి నివసిస్తున్న ఇండ్లపైన తీగలు వేలాడుతూ ఉన్నాయన్నారు. వాటిని తొలగించాలని అనేకసార్లు విద్యుత్తు అధికారులకు వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు తీగలు తొలగించాలని కోరారు. అధికారులు పట్టించుకోకపోతే దీక్షలకు కూర్చుంటామని హెచ్చరించారు.

ప్రజల భవిష్యత్తుకు టిడిపి గ్యారెంటీ : టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ గ్యారెంటీ ఇస్తుందని ఆ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్చార్జి భరత్ అన్నారు. నగరంలోని 7వ వార్డు పరిధిలోని మేదర వీధిలో ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రజల క్షేమం కోసం తన సొంత ఖర్చుతో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ 3 వేల విలువగల వైద్య పరీక్షలను ఉచితంగా చేపిస్తున్నానని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారు గౌరి గోపాల్ హాస్పిటల్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కరోనా తర్వాత ప్రజలు గుండె జబ్బుల బారిన పడి మృతి చెందిన సందర్భాలను గుర్తు పెట్టుకొని ఈ ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టిడిపి మొదటి విడత మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కర్నూల్‌లో వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కలీం భాయ్, శివానంద్, అబ్దుల్లా, బషీర్, సుజాత, ఫహద్, గులాబ్, మాజీద్, యూనుస్, అహ్మద్ అలీ ఖాన్, మహబూబ్ బాషా, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్న టీజీ భరత్

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని గణేష్ నగర్, పార్థసారథి టవర్స్ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో ఆ కాలనీకి చెందిన మహమ్మద్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం కర్నూలు మున్సిపల్ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

వినతుల్లో కొన్ని : తమ వీధిలోని టంగుటూరి మునిసిపల్ స్కూలు సమీపాన కొన్ని అనధికార ఎంక్రోచ్మెంట్లు ఉన్నాయని, కావున వీలైనంత త్వరగా వాటిని తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని ప్రకాష్ నగర్ వాసి పాండు కమిషనర్‌ను కోరాడు. పార్కుల అభివృద్ధి, కాలువ నిర్మాణం, వీధి దీపాల సమస్యలపై మారుతి మెగా సిటీకి చెందిన గంగిరెడ్డి వినతిపత్రం అందజేశారు. శ్రీ కృష్ణ కాలనీకి చెందిన మక్బూల్ అహమ్మద్ తమ వీధిలో మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని విన్నవించాడు. మారుతి నగర్‌లోని జుడీషియల్ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన చాంద్ హుస్సేన్, పుల్లారెడ్డి, ఇతరులు తమ వీధిలో రోడ్డు, కాలువలు నిర్మించాలని కోరారు. మునిసిపల్ పార్కు చుట్టూ ఉన్న ప్రహరీ గోడను పూర్తి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి, ఎస్ఈ.వేణు గోపాల్, ఇంచార్జి సిటీ ప్లానర్ మోహన్ కుమార్, ఎంహెచ్ఒ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, శానిటరీ సూపర్వైజర్లు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచాలి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి రైతులు తమ సొంత పొలంలో ఆరోగ్యకరమైన పంటలు పండించడంలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కర్నూలు మండలం దిన్నేదేవరపాడు గ్రామంలో నిర్వహిస్తున్న పొలం బడి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తన పొలంలో సొంత నిర్ణయాన్ని తీసుకునే సామర్థ్యాన్ని పెంచేలా కృషి చేయాలని తెలిపారు. ఒకే రకమైన పంట కాకుండా పలు రకాలు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లికార్జున, రమేష్, జుబేర్, రాముడు, చెన్నకేశవులు, మునిరాజు, మనోహర్, పొదుపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన శుద్ధి తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - మద్దికేర

రైతులు వేరుశనగ విత్తనాలను శుద్ధి తగిన మోతాదులో చేసుకోవాలని వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానికమండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక కేజీ విత్తనానికి ఇమిడా క్లోఫ్రిడ్ 17.8 ఎస్ఎల్‌నో రెండు మిల్లీలీటర్లు కలిసి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - పత్తికొండ

జర్నలిస్టుపై దాడి చేయడం తగదని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సాలురంగడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్‌లు డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి పిసి ఇంచార్జ్ రాజేష్‌పై దాడి నిరసిస్తూ సోమవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల మండపం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హొసూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలను వేధిస్తున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేస్తుండగా వార్త సేకరణకు వెళ్లిన ఆంధ్రజ్యోతి పిసి ఇంచార్జ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్ గౌడ్‌పై వైసిపి నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంతరం ఆర్డీవో మోహన్ దాస్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పక్కీరప్ప, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, మధుబాబు, నాగరాజు, చిన్న గిడ్డయ్య, హనుమంతు, పవన్, రాముడు, సురేష్, రంగన్న, రవిచంద్ర, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి
మంగళవారం 20 జూన్ 2023
5
నంద్యాల

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

ట్రూఅప్ చార్జీలకు వ్యతిరేకంగా మహా ధర్నా

30న జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

పెంచిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ డిస్కంలను ప్రైవేటుకరించరాదని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మణ్ అధ్యక్షతన సోమవారం నాడు పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, టిడిపి పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, టిడిపి ఫ్లోర్ లీడర్ మాభువళి, పట్టణ కార్యదర్శి బుజ్జి, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు బాబుల్లా, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు పట్టణ కార్యదర్శి కే మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి వెంకట లింగం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంగారయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అవుకు లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మధు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రజల పైన విద్యుత్ చార్జీల భారం మోపబోమని, ప్రజలకు నిత్యం కరెంటు ఉండేలా చూస్తామని, ఉచిత కరెంటు సరఫరా చేస్తామని, రైతులకు నష్టం కలిగించే ఏ చర్యలను చేపట్టబోమని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల కా లంలో 17వేల కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపైన మోపడం దుర్మార్గమని అన్నా రు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా మోసం చేశారని , స్మార్ట్ మీటర్ల పేరుతో ఆదానికి లాభం చేకూర్చే విధంగా వ్యవహారిస్తున్నాడని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ డిస్కంలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజల పైన పెద్ద ఎత్తున భారాలను మోపడమే ధ్యేయంగా పెట్టుకుందని, మోడీకి అనుకూ లంగా వ్యవహరిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రాబోయే కాలంలో ప్రజలంతా కలిసి కరెంటు ఇస్తారని అన్నారు. నంద్యాల పట్టణంలోని అన్ని వార్డులోని ప్రజలను కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తామని, అంతేకాకుండా ప్రతి అపార్ట్మెంట్‌కు వెళ్లి కరెంటు చార్జీల భారాన్ని వివరించి ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని అన్నారు. ఈనెల 30వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల ముందు మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని, పట్టణ ప్రజలు, మేధావులు, కార్మికులు, వామపక్ష, అఖిలపక్ష పార్టీల, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

నిలువు దోపిడీ..

- అంగళ్లుగా మారిన ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు
- పుస్తకాల పేరుతో బాదుడు - ఫీజుల దోపిడీకి అడ్డుకట్టేది..?
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. ఏకంగా విద్యాసంస్థల్లోనే దుకాణాలు ఓపెన్ చేశారు. పుస్తకాలు, టై, షూ, యూనిఫామ్ డ్రస్ అన్ని ఇస్తాం.. తల్లిదండ్రులు ఇక్కడే కొనాలి.. బయట కొనడానికి వీలు లేదు అంటూ హుకుం జారీ చేస్తున్నాయి. నర్సరీ, ఎల్‌కెజి, యూకేజి పిల్లలకు బుక్స్, యూనిఫామ్, షూలకే రూ.5 వేల నుండి రూ.6 వేలు వసూలు చేస్తున్నారు. అదే బయట మార్కెట్‌లో రూ.2 వేల నుండి రూ.3 వేల లోపు బుక్స్, యూనిఫామ్ వస్తుంది. అలాగే ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ విద్యార్థులకు రూ.7 వేల వరకు, హైస్కూల్ విద్యార్థులకు రూ.10 వేలు కేవలం పుస్తకాలకే వసూలు చేస్తున్నారు. ఇక యూనిఫామ్ సంగతి చెప్పనక్కర్లేదు. కేవలం అకాడమీక్ ఇయర్‌లోనే బుక్స్ యూనిఫామ్, షూ పేరు మీద కోట్ల రూపాయలను ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇక ఫీజుల విషయానికి వస్తే ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజుల పేరుతో విచ్చలవిడిగా తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యాజమాన్యాలే ఏకపక్షంగా ఫీజులు నిర్ణయించి దోపిడీ చేస్తున్నారు. ఫీజులు పెంచుకోవాలంటే ఆ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల మీటింగ్ వేసి ఏ మేరకు పెంచుకోవాలో నిర్ణయించి, తీర్మానం చేయాలి. కానీ ఆలా జరగడం లేదు. ఫీజులకు తగ్గటుగా విద్యాబోధన వుందా అంటే అదీ ఉండటం లేదు. కేవలం బట్టి పట్టించడం, విద్యార్థులను మరయంత్రాలుగా మారుస్తున్నారు. ఒక్కో పాఠశాలలో వందలు, వేల మంది విద్యార్థులు ఉంటే వారిలో కేవలం ఒక్కరు, ఇద్దరికి మాత్రమే అధిక మార్కులు వస్తున్నాయి తప్ప అందరికి రావడం లేదు. ఫీజులు మాత్రం వేలల్లో, లక్షల్లో వసూలు చేస్తున్నారు. వీటితో పాటు సిబిఎస్ఈ సిలబస్ అంటూ ఇతర ఆకర్షణీయమైన ప్రకటలు ఇస్తూ యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

సేవా దృక్పథం మరిచిన ప్రయివేట్ యాజమాన్యాలు

సేవా దృక్ప థంతో పాఠశాలలు ప్రారంభించామని, ప్రభుత్వం, రాష్టాభివృద్ధిలో భాగ స్వాముల మని చెప్పుకునే ప్రయివేట్ యాజమాన్యాలు సేవకు తిలోదాకాలు ఇచ్చాయి. తమ స్వార్థనికి ప్రాధాన్య తనిస్తూ ధనార్జనే ధ్యేయంగా యాజమా న్యాలు మారాయి. సేవను విస్మరించారు. కోట్లకు పడగలెతుతున్నారు. తల్లిదండ్రులను లూటీ చేస్తున్నారు.

విద్యా సంస్థల్లో పాఠ్య పుస్తకాలు అమ్మడం నేరం

విద్యా హక్కు చట్టం జి.ఒ నెం: 1/94 ప్రకారం విద్యా సంస్థలల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు,యూనిఫామ్,ఇతర స్టేషనరీ వస్తువులు విక్రయించడం చట్టరిత్యా నేరం. అనేక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అమ్ముతున్నాయి. పుస్తకాలపై ఉన్న ధర కన్నా అధిక ధరలకు అమ్మ్మాతున్నారు. ఇలా ప్రైవేట్ పాఠశాలల చేస్తున్న వ్యాపారం మండల విద్యా శాఖ అధికారులకు తెలిసి కూడా మామూళ్ల మత్తులో పడి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలల్లో తెరచిన అంగళ్లను మూపించాలి. లేని యెడల పాఠశాలల ఎదుట ప్రత్యక్ష ఆందోళనల నిర్వహించి, పార్టీ పుస్తకాలు దగ్ధం చేస్తాం.

- ఏ.నిరంజన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.నంద్యాలజిల్లా.

చేతబడి చేశారంటూ నగ్న పూజలు

- దాదాపు రూ. 9 లక్షల వసూలు - బాధితురాలి ఫిర్యాదుతో నిందితులు అరెస్టు

పట్టుబడిన నిందితులతో ఎస్సై రమణయ్య, సిబ్బంది

ప్రజాశక్తి - చాగలమర్రి

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని ఓ బాధిత మహిళ తన భర్తకు ఆరోగ్యం సరిగా లేక బాధపడుతుండడాన్ని ఆసరాగా చేసుకుని చేతబడి చేశారంటూ వారితో నగ్న పూజలు చేయించి, రూ. 9 లక్షలు వసూలు చేసిన నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చాగలమర్రి ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు... చాగలమర్రి మండలానికి చెందిన ఓ మహిళ మూడేళ్ల క్రితం తన భర్తకు ఆరోగ్యం సరిగా లేదని బాధపడుతుండడంతో రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన బత్తలూరి లక్ష్మి నాగమ్మ అలియాస్ బోయ సాయమ్మ ఆమెను కలిసి నీ భర్తకు చేతబడి చేశారని మాయమాటలు చెప్పింది. విరుగుడు పూజలు చేయాలంటూ రూ. 3 లక్షలు వసూలు చేసింది. అయినా ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో చేతబడి బలంగా చేశారని, తనకంటే పెద్దస్వామి దగ్గర పూజలు చేయించాలని నంద్యాల మండలం చాబోలుకు చెందిన పోలూరు మహ్మద్ హుసేన్‌ను పిలిచి పరిచయం చేసింది. అతను కూడా మాయమాటలు చెప్పి. బాధితుల నుంచి దాదాపు రూ. 6 లక్షలు వసూలు చేశాడు. పూజల్లో భాగంగా బాధితురాలికి, వారి కుటుంబంలోని మరో ముగ్గురికి ఒకరికి తెలియకుండా మరొకరికి పూజల పేరుతో భయపెట్టి నగ్న పూజలు చేయించాడు. బాధిత మహిళను బలవంతం చేసేందుకు ప్రయత్నించగా ఆమె తప్పించుకుని చాగలమర్రి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణలో భాగంగా సోమవారం ఉదయం రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మూఢనమ్మకాల పేరుతో ఎవరైనా పూజలు, చేతబడి, బాణామతి, లంకెబిందెలు వెలికితీస్తామని మాయమాటలు చెబితే నమ్మవద్దని ఎస్ఐ తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

ప్రజాశక్తి - ఆత్మకూరు

పెద్ద పులి దాడిలో ఆవు మృతి చెందిన ఘటన ఆత్మకూరు మండలంలో చోటుచేసు కుంది. నల్లమల్ల అడవిని వదిలి నీటి కోసం పులులు గ్రామాల వైపు వస్తున్నాయా అనే అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆత్మకూరు మండల పరిధిలోని పెద్ద అనంతపురం గ్రామం సమీపంలో పెద్దపులులు సంచరించినట్లు వాటి అడుగులు కనిపించాయి. ఆవుల మందపై దాడి చేయడంతో రెండు ఆవులు మతి చెందినట్లు తెలుస్తుంది. పులులు గ్రామాల వైపు వస్తున్నాయన్న విషయం తెలుసుకొని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పులులు అడుగులను గుర్తించి, పులులు గ్రామాలకు రాకుండా ఎలా చర్యలు చేపట్టాలన్న విషయంపై సమాలోచన చేస్తున్నారు. వేసవికాలం వచ్చిందంటే నల్లమల్ల అడవిలోని పులులు నీటి కోసం గ్రామాల వైపు వస్తుంటాయి.

అప్పల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె

మృతిచెందిన బుర్ర జనార్ధర్

బనగానపల్లె మండలం పండ్లాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు బుర్ర జనార్ధన్ (36) అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకు న్నాడు. నందివర్గం ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పండ్లాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు బుర్ర జనార్ధన్ 30 ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. మూడు సంవత్సరాల నుండి వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసేవాడు. పంట పండితే అప్పులు చెల్లించవచ్చని ఆశతో ప్రతి సంవత్సరం పంటలు సాగు చేసేవాడు. కౌలుకు తీసుకున్న పొలంలో పెట్టుబడికి గ్రామంలో కొంతమంది దగ్గర సుమారు రూ. 16 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట సరిగా పండక, పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అప్పులు చెల్లించలేనని మనస్థాపంతో దిగులుతో అప్పు తీర్చలేక ఈ నెల 16న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం అర్థరాత్రి మృతి చెందాడు. కౌలు రైతు భార్య బుర్ర ఇందిరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌలు రైతు మృతికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

మండలంలోని పండ్లాపురం గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన కౌలు రైతు బుర్ర జనార్ధన్ మృతదేహానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు వైసీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి నివాళులర్పించారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బుర్ర జనార్ధన్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.

మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛభారత్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని 29 మండలాలలోని గ్రామాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు దాదాపుగా పది నెలలు ఉన్నాయని వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి .యేసురత్నం స్వచ్ఛ భారత్ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సుబ్బరాయుడు, హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు అనేక నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయని వేతనాలు అడిగితే ఉద్యోగాలు మానుకోండని బెదిరింపులు చేయడం దుర్మార్గం అన్నారు. అధికారులు పనులు చేయించడంలో ఉన్నటువంటి శ్రద్ధ వారికి జీతాలు ఇప్పించడంలో లేరని అన్నారు. గ్రామ నిధులలో నుండి స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, కేవలం 15 ఫైనాన్స్ నిధులు వచ్చినప్పుడు మాత్రమే వేతనాలు చెల్లిస్తామని అధికారులు చెప్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా వేతనాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. జీవో నెంబర్ 680 జీవో ప్రకారం నెలకు పదివేల వేతనం ఇవ్వాల్సి ఉండగా.. .జిఒ వచ్చి దాదాపుగా మూడు సంవత్సరాలు కావస్తున్న అమలు చేయడం లేదని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు సుధాకర్, మహేంద్ర, బక్కన్న, లక్ష్మి, పుల్లయ్య, పుల్లమ్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని బాలసదనము అనాథ ఆశ్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి శంషల్ హక్, ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు బరగొడ్ల హుస్సేన్ బాష ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో దేశంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తద్వారా రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారన్నారు. నిజాయితీకి మారుపేరు రాహుల్ గాంధీ అని రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యే అవకాశాలు వచ్చిన తిరస్కరించిన గొప్ప వ్యక్తి అన్నారు. దేశంలో బిజెపి చేస్తున్న అవినీతి పరిపాలనను అంతం చేయడానికి, దేశ ప్రజల యొక్క మనోభావాలను దెబ్బ చేసే విధంగా పరిపాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాహుల్ గాంధీని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన కూడా అలుపెరగని పోరాటం చేస్తున్న వ్యక్తి రాహుల్ గాంధీ అన్నారు. ఏ స్వార్థం లేని రాహుల్ గాంధీ 2024లో తప్పకుండా ఈ దేశానికి ప్రధాని అవ్వాల్సిన అవసరం ఉందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ఆంధ్రకు ప్రత్యేక హోదా, రాయలసీమ ప్యాకేజ్, రూ.500కు గ్యాస్ సిలిండర్, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామ న్నారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి లక్ష్మీ నరసింహుడు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు యాదవ్, సంజీవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు తేనెటీగల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - మహానంది

స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ శ్రీశైల వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏడు రోజులు తేనెటీగల పెంపకంపై శిక్షణా కార్యక్రమం మూడవ రోజు సోమవారం చెంచు లక్ష్మిగూడెం సందర్శించారు. ఐటిడిఏ పిఓ రవింద్రనాథ్ రెడ్డి చెంచులక్ష్మి గూడంకి ముఖ్య అతిథిగా విచ్చేసి తేనెటీగల పెంపకంపై గిరిజనులు నేర్చుకున్నదాన్ని గురించి వాటి ఉపయోగాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కోర్స్ డైరెక్టర్ మంజునాథ్ , రామరాజు, వెలుగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'జగనన్న సురక్ష' విజయవంతం చేద్దాం

- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 23న "జగనన్న సురక్ష" యాప్‌ను ప్రారంభించనున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుండి వాలంటీర్‌లు ఇంటింటికి వెళ్లి అమలవుతున్న పథకాలను ప్రజలతో చర్చించి సమస్యలను గుర్తించి వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించి నంద్యాల నియోజక వర్గానికి డిఆర్డిఎ పిడిని, డోన్ కు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, నందికొట్కూరుకు భూగర్భ జల శాఖ డిడి, బనగానపల్లెకు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్, ఆళ్లగడ్డకు నంద్యాల ఆర్డీవో, ఆత్మకూరుకు పట్టు పరిశ్రమ శాఖ డిడి, పాణ్యం నియోజకవర్గానికి మార్క్ఫెడ్ జనరల్ మేనేజర్‌లు నోడల్ అధికారులు వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు. జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును నాణ్యతతో వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యను పారదర్శకంగా అర్జీదారులు సంతప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందనలో 244 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన తదితర అంశాలపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

పట్టా పాస్ పుస్తకాలకు భూములు చూపాలి

- వ్యకాసం ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి - ఆత్మకూరు

మిడుతూరు గ్రామంలో ఎస్‌సి, బిసిలకు మంజూరు చేసిన పట్టా పాసు పుస్తకాలకు భూములు చూపాలని పి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, కర్ణ, రైతు సంఘం నాయకులు సుధాకర్, మహబూబ్ బాషాలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మండల కార్యదర్శి టి.ఓబులేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిడుతూరు గ్రామంలో ఎస్‌సి, బిసిలకు 1996లో అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, 2008-2009లో పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. అప్పటి నుండి వారు సొసైటీ బ్యాంకుల్లో అప్పులు తీసుకుంటూ ప్రభుత్వ మంజూరు చేస్తున్న విత్తనాలు తీసుకుంటున్నారని తెలిపారు. భూములు చూపించాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేసిన వారి పేర్లు ఆన్లైన్లో నమోదు చేసి వారికి భూములు చూపించాలని కోరారు. అనంతరం ఆత్మకూరు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కి సర్వే చేయించి రిపోర్టు ఇచ్చామని, త్వరలో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు మాభాష, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న వ్యకాసం నేతలు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

210 లీటర్ల నాటు స్వాధీనం ఆటో సీజ్ నిందితులు అరెస్ట్ ఎస్ఐ రమేష్ రెడ్డి సోమవారం తెలిపారు. కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన ఎరుకల రవి,ఎరుకల తిరుపతమ్మ, దాసరి గంగన్న,దాసరి నాగమ్మ అను వ్యక్తులు బూర్గుల దగ్గర గల సీతమ్మతాండాకి చెందిన పరమేష్ నాయక్ వద్ద నుండి నాటుసారాను తీసుకొని అందరూ కలిసి కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామ సమీపంలో అమ్ముతుండగా ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. బెలుం గ్రామానికి చెందిన నాగరాజు అను వ్యక్తి అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన శ్రీను అను వ్యక్తి నుండి 10లీటర్ల నాటుసారా తీసుకొచ్చి ఇరువురు కలిసి బెలుం గ్రామ సమీపంలో విక్రయిస్తుండగా ఇరువురుని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి 10 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజ్ చేసిన ఆటో

విత్తన దుకాణాలను ఎడి తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలోని విత్తన దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. విత్తన నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జెసి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ప్రతిరోజు విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారి పై చట్టపరమైన చర్యలు చేపడతామని చెప్పారు. రికార్డుల సక్రమంగా నిర్వహించలేదని 19.20 క్వింటాల్స్ రూ.8,64,000 విలువ గల విత్తనాలను, రూ.13,64,200 విలువగల 55.02 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకలను నిలుపుదల చేశామన్నారు.

తనిఖీలు చేస్తున్న ఏడి ఆంజనేయులు విష్ణువర్ధన్ రెడ్డి

అంగన్వాడీల్లోనే పిల్లల సమగ్ర అభివృద్ధి

ప్రజాశక్తి - సంజామల

అంగన్వాడి కేంద్రాల్లోతోనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యం అనిఐసిడిఎస్ సూపర్వైజర్ శాంత అన్నారు. సోమవారం సంజామల మండల కేంద్రంలో జన బాగి దారి కార్యక్రమం నిర్వహించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న వాటిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 115 ఫిర్యాదులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ స్పందనలో వచ్చిన పిర్యాదులకు తక్షణమే పరిస్కారం చూపి స్పందన పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి 115 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు స్పందనలో ఎక్కువగా ఆస్తి తగదాలు వచ్చాయి. ఫిర్యాదులపై అదికారులు తీసుకున్న చర్యలను జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ప్రతి సోమవారం ప్రతి పోలీసు స్టేషన్, సర్కిల్ ఆఫీసులలో డీస్పీ ఆఫీసులలో స్పందన కార్యాక్రమం నిర్వహించి సమాచా రం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ స్పందకు వచ్చిన ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి .వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జెవి సంతోష్, సీఐ దస్తగిరి బాబు, దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ దనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పథకాల ముసుగులో వైసిపి దోపిడీ

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల ముసుగులో దోపిడీకి పాల్పడుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యులు, లోక్ సభ, శాసన సభ స్థానాల ఇంచార్జీలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరైయ్యారు. అనంతరం ఆయన మీడియతో మాట్లాడుతూ మహానాడు సాక్షిగా టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమం 'భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకాన్ని కోల్పోయారని, మాట తప్పి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందించే భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం గ్రామ గ్రామాన నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం నియోజకవర్గంలో కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టిడిపి అధికారంలోకి వేస్తే ఆ పథకాలను రద్దు చేస్తారని చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఖండించారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు సంపద సృష్టించే సామర్థ్యం గల ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడి అని అన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని ఏపీ మోడల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో చేరడానికి నిర్వహిం చిన ప్రవేశ పరీక్ష ఫలితాలను జిల్లా విద్యాశాఖ విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ చంద్రసేన రెడ్డి తెలిపారు. మంది విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా మంది పరీక్షలు రాశారని విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల మెరిట్ జాబితాను సోమవారం పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించామని అన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎబివిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో జిల్లా కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకొని ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు తరుణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

26న చిరుధాన్యాల వంటల పోటీలు

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈనెల 26వ తేదీన అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం పురస్కరించుకొని చిరుధాన్యాల వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, యూనిటీ హెడ్ ధనలక్ష్మి సోమవారం తెలిపారు. యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు చిరుధాన్యాలైన జొన్న లు, రాగులు, ఆరికలు, కొర్రలు, సజ్జలు, ఒరిగేలు, సామాలు, అండ్రు కొర్రలతో బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ ,స్వీట్లు, సావారిస్ ఇంటి వద్ద తయారు చేసుకుని ఈనెల 26న కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. పోషక విలువలతో కూడిన వంటకాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు9441192765 లకు సంప్రదించాలన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని కస్తూరిభా గురుకుల పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్గా సునీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల సర్వేయర్గా మద్దిలేటి, అదనపు ఎంఈఓ గానైముతుల్లాలు బాధ్యతలు చేపట్టారు. వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో

స్పందన అర్జీదారులకు అన్నదానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన అర్జీదారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సోమవారం హైదరాబాద్కు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి షాషావలి సహకారంతో దాదాపు 250 మంది అర్జీదారులకు జిల్లా అధికారులు రఘురాం (గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్), మైనింగ్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై అర్జీదారులకు ఆహారం పంపిణీ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, పర్ల కోశాధికారి నాగేశ్వరరావు, నంద్యాల మండల బ్రాంచ్ నాయకులు సోహెల్, డీఎఫ్ఓ రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ చోరీ

- బాధితురాలికి అప్పగింత

ప్రజాశక్తి - బేతంచర్ల

సెల్ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

బేతంచెర్లలోని శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన శ్రీలత సెల్ ఫోను చోరీకి గురైంది. దొంగతనం చేసిన వ్యక్తి సెల్ ఫోనును ఆస్పత్రి సమీపంలో చెరుకు రసం అమ్మే చిరు వ్యాపారి హజీమ్ అలీ దగ్గరకు వచ్చి కొనుక్కుంటావా అని అడిగాడు. చెరుకు రసం వ్యాపారి సెల్ఫోన్ తీసుకొని అనుమానంతో పోలీస్ స్టేషన్కు వెళ్లి అప్పగించాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ సెల్ ఫోన్ను పరిశీలించి బాధితురాలిని గుర్తించి శ్రీలతకు అందజేశారు. సెల్ఫోన్ అప్పగించిన చెరుకు రసం వ్యాపారి హాజీమ్ ఆలీని పోలీస్ అభినందించారు.

20న సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన సమావేశం

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

గ్రామీణాభివృద్ధికి సంబంధించి సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన సమావేశాన్ని ఈనెల 20వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారుల ందరూ హాజరు కావాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

వైసిపికి మళ్లీ అవకాశం ఇవ్వాలి : ఎమ్మెల్యే

పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంక్షేమ పథకాల ను వివరిస్తున్న ఎమ్మెల్యే

చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

పథకాల బుక్లెట్ను అందజేస్తున్న ఎంపిపి బుగ్గన

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీని అఖండ మెజార్టీతో గెలిపించా లని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలం లోని చిన్న రాజుపాలెం, చిన్న రాజుపాలెం తండాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఎంపీపీ మానసవీణ, చిన్న రాజుపాలెం తాండ సర్పంచ్ పార్వతి బాయి, వై సిపి నాయకులు పాపన్న, ఈశ్వర్ నాయక్ ల ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నాల జనార్ధన్ రెడ్డి, పసుపల సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్, వైసిపి నాయకులు శంకర్ నాయక్ మండల అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి : మ్యానిఫేస్టోలో ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డినేనని ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం చాగలమర్రి పట్టణంలోని 2వ సచివాలయ పరధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కు విచ్చేసిన ఎమ్మెల్యేకి వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,ఎంపిపి వీరభద్రుడు,వైసిపి నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్,వైస్ ఎంపిపి రఫి, ఎంపిటీసిలు పత్తి నారాయణ,లక్ష్మిరెడ్డి,ఫయాజ్,చక్రం బీడి షబ్బీర్,మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్,కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, షబ్బీర్, ఖాధర్బాష,బ్రాందీన్,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పిల్లలను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ఆదేశించారు. సోమవారం గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రం, ఉర్దూ స్కూల్ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలకు క్రమం తప్పకుండా జగనన్న గోరుముద్ద పథకంలోని మెనూ అందించాలని ఆదేశించారు.

బేతంచెర్ల: రాజకీయ, కులమతాలకు కతీతంగా గ్రామస్థాయి నుండి ఏ భేదం లేకుండా అభివృద్ధి చేస్తూ, సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ గుమ్మ గాళ్ళ రాజు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, సర్పంచ్ గుమ్మగాళ్ళరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు గూని నాగరాజు, మోహన్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, గూని నాగేశ్వరరావు వెంకటేశ్వర్లు ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రజలకు ఏదైనా పత్రాలకు సంబంధించి, సర్టిఫికెట్లకు సంబంధించి లేదా సంక్షేమ పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ నెల 23 జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తహసీల్దారు విజయ్ కుమార్, ఎంపిడీఓ మహబూబ్దౌలా తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని పంచాయితీ కార్యదర్శులు,విఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది తో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 23న ఈ కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 24 నుంచి వాలంటీర్లు, గృహ సారథులు,సచివాలయాల కన్వీనర్లు,సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు,కుల,ఆదాయ,జనన,మరణ,తదితర దవపత్రాల అవసరాలను గుర్తించి యాప్లో నమోదు చేయాలన్నారు. నెలరోజుల పాటు కొనసాగనున్న ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు సంబంధించి మండలాధికారుల బృందాలు క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు లేదా ఏదైనా పత్రాలు, సర్టిఫికెట్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వారిని వెంటనే సచివాలయాల వద్దకు తీసుకువచ్చి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు లేదా డాక్యుమెంట్లు లేదా పథకాలకు అర్హతలకు సంబంధించి ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతారన్నారు. అనంతరం ఫీల్డ్ ఆపరేషన్ ఏజెన్సీ ఎంఎల్ఓ హరికృష్ణ సిబ్బందికి కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఈఓఆర్డి సుదర్శన్ రావు,పంచాయితీ కార్యదర్శులు, విఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం:** రుద్రవరంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ రెడ్డి, మండల పరిషత్ ఏవో వరలక్ష్మి, డిప్యూటీ తహసిల్దార్ మహబూబ్ బాషా అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం : సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

స్వాంతన హాస్పిటల్లో అరుదైన శస్త్రచికిత్స

విజయవంతమైన మోకాళ్ళ చిప్పల మార్పిడి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అత్యున్నత స్థాయి వైద్య ప్రమాణాలతో కర్నూల్, హైదరాబాదు,చెన్నై బెంగళూరు వంటి నగరాలకు ధీటుగా వైద్య సేవలు కొనసాగిస్తున్నామని చెప్పుటకు ఎంతో గర్విస్తున్నామని స్వాంతన మల్టీ స్పెషాలిటీ వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. స్థానిక ఆసుపత్రిలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాంతన హాస్పిటల్ నందు అధునాతన లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్ సౌకర్యం ఉందన్నారు. అంతే కాకుండా లాప్రోస్కోపిక్, బటన్ హోల్ ఆపరేషన్లు, గాల్ బ్లాడర్ ఆపరేషన్లు, హెర్నియా వంటి ఆపరేషన్ లు దాదాపుగా ఏనభై సర్జరీలు చేయించి రోగులను స్వస్థత చేకూర్చడం జరిగిందన్నారు. గత మూడు రోజుల కిందట అళ్ళగడ్డ మండలం చింతకుంట గ్రామానికి చెందిన సుధారాణి(56) మోకాళ్ళ నొప్పితో దీర్ఘ కాలంగా బాధ పడుతూ తమ ఆసుపత్రికి వచ్చిందని అవసరమైన రోగ నిర్ధారణల అనంతరం డాక్టర్ మొహసిన్ కమల్ (కీళ్ళు, ఏముకల వ్యాధి నిపుణులు) శస్త్ర చికిత్స ద్వారా మోకాళ్ల చిప్పల మార్పిడి సమర్ధ వంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ మోకాళ్ళ నొప్పితో తీవ్ర నిరాశకు గురయ్యానన్నారు. స్వాంతన హాస్పిటల్ లో మోకాళ్ళ చిప్పల మార్పిడి వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలుసుకొని ఇక్కడే శస్త్ర చికిత్స చేయించుకున్నానని మరుసటి రోజే వాక్ స్టిక్ సహయంతో నడవగలిగానని తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వాంతన హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శీలం సురేంద్రనాథ రెడ్డి(చిన్న పిల్లల వ్యాధి నిపుణులు), డాక్టర్ సుధామణి(స్త్రీ సంబంధిత వ్యాధుల నిపుణులు) కి అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న వైద్యులు సురేంద్ర నాథ్ రెడ్డి

నూతన ఎంఇఒ-2లు బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు చేపడుతున్న మురళీమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండల విద్యాశాఖ-2 అధికారిగా మురళీమోహన్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి రెండవ ఎంఇఒను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డోన్ మండలం కొచ్చేరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మురళీమోహన్ రెడ్డి పగిడ్యాల ఎంఇఒ-2గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మురళీమోహన్ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

రుద్రవరం: రుద్రవరం మండల రెండవ ఎంఈఓగా లక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతము ఎంఈఓగా కోటయ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ఉన్నత అధికారులు రుద్రవరం మండలానికి రెండవ ఎంఈఓగా కొలిమిగుండ్ల మండలం కనకాద్రి పల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకి పదోన్నతి కల్పించి రెండవ ఎంఈఓగా రుద్రవరం మండలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు.

రుద్రవరం ఎంఇఒ-2గా లక్ష్మి

ప్యాపిలి : మండల నూతన విద్యాశాఖ అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విద్యా అభివృద్ధిపై చర్చించారు. వారు మాట్లాడుతూ మండలంలోని నాడు నేడు పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులలో పోషకాహార లోపాన్ని తగ్గించి నాణ్యమైన ఆహారాన్ని వారికి అందేలా ప్రభుత్వం చేపడుతున్న మిడ్ డే మీల్స్ను మెనూ ప్రకారం సక్రమంగా అందేలా చూస్తానని తెలిపారు. తరువాత ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్ ఎంఇఒను శాలువా కప్పి పూలమాలతో సన్మానిం చారు. వారికీ ఎస్టియు డైరీను అందించారు. చిన్నపరెడ్డి, హాజీ మస్తాన్ వలి, నాగ మల్లేష్ పాల్గొన్నారు.

ఎంఇఒను సన్మానిస్తున్న ఎస్టియు నాయకులు

గుండెపోటుతో

దీక్షిత్ విద్యాసంస్థల అధినేత మృతి

ప్రజాశక్తి - కొలిమిగండ్ల

దీక్షిత్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు (50) గుండెపోటుతో మతి చెందాడు. సోమవారం తెల్లవారుజామున ఆయనకు గుండెపోటు రావడంతో తాడపత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు ప్రము ఖులు నివాళులర్పించారు. నాగిశెట్టి పల్లి (రామకృష్ణాపురం) గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు కొలిమిగుండ్ల మండల కేంద్రంలో విద్యాసంస్థల స్థాపించాడు. తోపాటు మండలం కేంద్రంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల స్థాపించడం వల్ల విద్యార్థులు విద్యార్థులకు విద్య పరంగా విద్యను విద్యార్థులకు చేరువ చేశారు.మండల కేంద్రంలో దీక్షిత్ విద్యా సంస్థల తోపాటు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తోపాటు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని, సేవా గుణం కార్యక్రమాల్లో ముందుండే నడిపించేందుకు కృషి చేసేవారని పలువురు కొనియాడారు.

ఘాట్ రోడ్లో వాహనాలు ఢీ

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - మహానంది



నల్లమల్ల ఘాట్ రోడ్డులో రెండు వాహనాలను లారీ ఢీకొన్న సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల్ల ఘాట్ రోడ్డులో నంద్యాల నుంచి విజయ వాడకు వెళుతున్న వాహనాన్ని, అదే సమయంలో గిద్దలూరు నుంచి నంద్యాలకు వస్తున్న మరో వాహనాన్ని, ఒంగోలు నుంచి జొన్నల లోడుతో నంద్యాలకు వస్తున్నా లారీ నల్లమల్ల ఘాట్ లోని మోత్కమాన్ రైల్వే వంతెన సమీపంలోని మలుపు వద్ద కారును తప్పించే క్రమంలో రెండు వాహనాలను ఢీ కొంది. ఈ ఘటనలో రెండు వాహనాలలోని పదిమంది ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. దీనితో అందులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీని నిలపకుండా వెళ్తుంటే నూర్ భాషా అనే వ్యక్తి ఇతర వాహనంలో లారీని వెంబడించి ఆపి డ్రైవర్ని విచారించగా వాహనానికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయని తెలిపాడన్నారు. అతను వెంటనే మహానంది పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటనా స్థలానికి మహానంది రోడ్ సేఫ్టీ పోలీస్ సిబ్బంది చేరుకొని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ విచారణ చేపట్టారు.

బైకులు ఢీ - ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గాయపడిన యువకులు

కొత్తపల్లి మండలంలోని పెద్ద గుమ్మడాపురం బస్ సెంటర్ వద్ద సోమవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరిని కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలు.. ఆత్మకూరు మండలం కొత్త రామాపురం గ్రామానికి చెందిన వెంకట లక్ష్మమ్మ తన కుమారుడు యుగంధర్తో కలిసి మోటార్ సైకిల్పై సంగమేశ్వరాలయానికి వెళ్తున్నారు. అదే సమయంలో జూపాడుబంగ్లా మండలం తుడిచెర్ల గ్రామానికి చెందిన జేమ్స్, కిరణ్లు మోటార్ బైక్పై ముసలమడుగు గ్రామానికి తన చెల్లిని చూసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్ద గుమ్మడాపురం బస్ సెంటర్ వద్ద జేమ్స్, కిరణ్ వెళ్తున్న బైకు అదుపుతప్పి ముందుగా వెళుతున్న బైకును ఢీకొట్టారు. దీంతో వెంకట లక్ష్మమ్మకు, జేమ్స్, కిరణ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆత్మకూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 21వ తేదీ నంద్యాల పట్టణం టెక్కె సమీపంలోని యోగ చైతన్య కేంద్రం, యోగ చైతన్య నగర్ లో ఉదయం 6:30 నుండి 8:00 గంటల వరకు సామూహిక యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ, ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి మెడికల్ ఆఫీసర్ యశోదర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ పాల్గొని ఆరోగ్యవంతులుగా జీవించాలని కోరుతూ విజయవంతం చేయాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే ధ్యేయం : జడ్పిటిసి

ప్రజాశక్తి - పగిడ్యాల

పేద పిల్లలు మంచి విద్యను అభ్యసించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని జడ్పిటిసి పుల్యాల దివ్య అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మధుసూదన్ రావు అధ్యక్షతన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పుల్యాల దివ్య, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న హాజరై మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలలకు మహర్దశ తీసుకొచ్చారని అన్నారు. ఎంఇఒ సుభాన్ మాట్లాడారు. అనంతరం 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన రియాజ్కు రూ.3 వేలు, జానకి రూ.2 వేలు, నందిని, నాగ మద్దిలేటిలకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహ బహుమతులు జడ్పిటిసి పుల్లాల దివ్య, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం హెచ్ఎం సలీం బాషా అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మద్దిలేటి అచారి, 15వ వార్డు వైసిపి నాయకులు బ్రహ్మయ్య ఆచారి హాజరయ్యారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొల్ల షబానాకు రూ. 3 వేలు, జకట ఆదిత్యకు రూ.2 వేలు, బోనాసి శివ ప్రసాద్ ఆచారికి రూ. వెయ్యి నగదుతో పాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. **ఆత్మకూర్ :** వెంకటాపురం ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు అభినందన సభ హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు బి.ఆసిన్కు రూ. 3 వేలు, తేజోమయి, విఘ్నేశ్వర్ రెడ్డికి రూ. 2 వేలు చొప్పున, సాయినాథరెడ్డికి రూ. వెయ్యి అందజేశారు. ఉపాధ్యాయులు జవహర్ నాయక్, గాలిబ్ అహ్మద్, రమణ, వలిబాష, శోభన్ బాబు నాయక్, దాసు, ప్రదీప్, పుష్పలత, సంజమ్మ, మంజువాణి, సునీత పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు మండలం వేంపెంట జడ్పీహెచ్ హై స్కూల్లో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన జగనన్న ఆణిముత్యాలకు ఎంఈఓ బాలాజీ నాయక్, వేంపెంట గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ చేతుల మీదుగా ప్రైజ్ మనీ పంపిణీ చేశారు. మాల్యశ్రీ భాయ్కు రూ. 3 వేలు, సురేంద్ర కుమార్కు ర. 2 వేలు, మూడవ స్థానం విద్యార్థికి రూ. వెయ్యి అందజేశారు. హెచ్ఎం కృష్ణమూర్తి, రిటైర్డ్ టీచర్ దానమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాములపాడులో..

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్పిటిసి, సర్పంచు ఉపాధ్యాయులు

నందికొట్కూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరులో..

NANDIKOTKUR MUNICIPALITY
Expression of Interest (EOI)

Nandikotkur Municipality, Old Bus stand, Nandikotkur,
Telephone No 08513-280312.,
e-mail id: mc.nandikotkur@cdma.gov.in

Tender Notification No. 5/AMRUT 2.0 & SWAP/E1/2023, Dt: 19/06/2023 of Nandikotkur Municipality

The Commissioner, Nandikotkur Municipality, Nandikotkur invites Sealed expression of interest is invited from the experienced firms/ Organizations/Academic institutions for Open bid tender notification for Preparation of Detailed Project Report (D.P.R) for **Providing water supply to weaker section colonies in Nandikotkur Municipality under Atal Mission for Rejuvenation and urban transformation 2.0 (AMRUTH 2.0) & State Water Action Plan (SWAP) Tranche-2** from the Govt. of A.P to the Nandikotkur Municipality.

- Cost of tender schedule:Rs.7000/- in shape of DD in favour of Commissioner, Nandikotkur Municipality and Rs.625/- in favour of Commercial Tax Officer, Kurnool.
- The Schedule Sale opening Date:21/06/2023.
- The Schedule Sale Closing Date: 28/06/2023.
- Last Date for submission of tender schedule: 28/06/2023 i.e 7th day by 5.00 P.M.

Other Details can be had from the Engineering Section of Nandikotkur Municipality, Nandikotkur. The Municipal Commissioner, Nandikotkur Municipality have reserves all the rights to reject or postpone or fix up special conditions for all the bids without assigning any reasons thereof.

E-Mail ID for Clarifications /Communication : mc.nandikotkur@cdma.gov.in
Contact: No's : 8333903567, 8333903566

Sd/-(P.Kishore)
Commissioner
Nandikotkur Municipality

IN THE COURT OF SENIOR CIVIL JUDGE : DHONE
I.P.NO.12/2023

మేకల ఆశోక్ కుమార్, తండ్రి లేట్ మేకల సుబ్బడు, సి.ఎస్.ఐ చర్చి దగ్గర, సిమెంట్ నగర్ గ్రామం, బేతంచర్ల మండలం, నంద్యాల జిల్లా. ...పిటిషనర్

V/s

1) మల్లెపోగు మల్లేశ్వరి బాయి భర్త ఎం.రాజేంద్రప్రసాద్, తారక రామానగర్, కర్నూలు సిటి, కర్నూలు జిల్లా.
2) చౌరస్తా అకిల్, సుంకులమ్మ గుడి దగ్గర, బుధవారపేట, కర్నూలు సిటి, కర్నూలు జిల్లా.
3) లోకేష్, గ్రీన్ పార్కు మరియు కె.సి.కెనాల్ ఎదురుగా, కర్నూలు సిటి, కర్నూలు జిల్లా.
4) బిర్లాగడ్డ అనిల్, బిర్లాగడ్డ దగ్గర, కర్నూలు సిటి, కర్నూలు జిల్లా.
5) మాదిగ సహరా, III టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, శ్రీచక్ర హస్పిటల్ ఎదురుగా, బుధవారపేట, కర్నూలు సిటి, కర్నూలు జిల్లా. ...రెస్పాండెంట్స్

పై కనబరచిన అర్జీదారు తనని దివాలా కోరుగా డిక్లేర్ చేయమని, మీ పైన, పై కోర్టులో అర్జీదాఖలు చేసివున్నాడు. మీకు ఎటువంటి ఆక్షేపణలు వున్న ఎడల 26-06-2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో మీరు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని వచ్చి తెలియజేసుకొనవలయును. లేని ఎడల మీ పరోక్షమందు అర్జీ విచారించి తీర్మానము చేయబడును.

(By Order Of The Court)

T.E.Venugopal Goud,
P.Siva Ramakrishna,
R.Ramudu,
T.E.Raghavendra Goud,
Advocates,
Dhone, Nandyal Dist.
Cell : 8919341216